www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 మే 2023



అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



విశ్వనాథ్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ములకలచెరువు: అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని పర్తికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన బి.విశ్వనాథెడ్డి(40) జీవనోపాధి కోసం బొలెరో వాహనాన్ని ఫైనాన్స్ కంపెనీలో రూ.8లక్షలు అప్పులు చేసి కొనుగోలు చేశారు. బాడుగలు సక్రమంగా రాకపోవడంతో వాహనంపై తీసుకున్న ఫైనాన్స్ కట్టకపోవడంతో కంపెనీ వారు వాహనాన్ని జప్తు చేశారు. ఏమి చేయలేక స్వగ్రామంలోనే రెండు ఎకరాలు వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని టమోటా పంట సాగు చేశారు. ధరలు విపరీతంగా తగ్గిపోవడంతో రూ.4 లక్షలు అప్పు మిగిలింది. పిల్లల చదువులు భారం కావడంతో పాటు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై టమోటా పంట సాగు చేసిన పొలం వద్దనే గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రయివేట్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని తెలిపారు.

'పచ్చబంగారం' ధర పలికేనా?



- పడిపోయిన ధరలు
- పెట్టుబడులు దక్కని వైనం
- పసుపు సాగుపై రైతుల్లో అనాసక్తి
- రిజిస్ట్రేషన్‌కే పరిమితమైన అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

పచ్చ బంగారంగా పేరొందిన పసుపును ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం చేతికిరాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంటల దిగుబడి, గిట్టుబాటు ధరలు పడిపోవడంతో రైతుల పరిస్థితి దిక్కుతోచని పరిస్థితికి మారింది. తాము పండించిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వానికి కోరుతున్నా ఫలితం శూన్యం. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పుకుంటున్న నాయకులు ఉపన్యాసాలు కేవలం మాటలకే పరిమితమవుతన్నాయి. నిజానికి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. జిల్లా వ్యాప్తంగా పసుపు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. పసుపు పంటపై మక్కువతో రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు సంక్షోభంలో కూరుకుపోతున్నారు.

పడిపోయిన ధరలు

పసుపు ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో భారీగా పడిపోయాయి. క్వింటా పసుపు రూ.ఐదు వేల వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వం మాత్రం పసుపు కొనుగులు చేయడంలో పూర్తిగా విఫలమైంది. గత ఏడాది మాత్రం కంటితుడుపుమ చర్యగా ప్రభుత్వం రూ.6,800 కొనుగోలు చేసింది. ఈ ఏడాది కొనుగోళ్ల ప్రస్తావనే తేవడం లేదు. రైతులు మాత్రం మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఎలాంటి తరుగులు లేకుండా రూ5,500 కొనుగోలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటు వ్యవసాయాన్ని వదులుకోలేక, అటు కూలీ చేయలేక మార్కెట్ ధర ఏడాదికేడాది పెరుగుతుందనే ఆశతోనే రైతులు పంటను సాగుకు పూనుకుంటున్నారు. రెక్కలు ముక్కలవుతున్నాయే తప్ప గిట్టుబాటు రేటు లభించడం లేదని రైతులు వాపోతున్నారు. క్వింటాకు ప్రభుత్వం రూ.10 వేలు చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

భారంగా పెట్టుబడులు

పసుపు రైతులకు పెట్టుబడులను నష్టపోనున్నారు. ప్రతి సంవత్సరం పంట సాగుకు పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. పసుపు విత్తనం నుంచి ఉడకపెట్టి గ్రేడింగ్ చేసేంతవరకూ ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. ఒక ఎకరాకు పసుపు విత్తనం ఏడు పుట్లు (ఒక పుట్టి 240 కిలోలు) అవసరం అవుతుంది. విత్తనమే సుమారు రూ.35 వేల వరకు అవుతుంది. దుక్కి, అచ్చు కట్టవేయుటకు, కలుపులకు, రసాయనిక ఎరువులు, తెలుగుళ్లకు మందులు, ఇతర ఖర్చులకు సుమారు రూ.45 వేలు ఖర్చవుతుంది. ఇవి కాకుండా అదనంగా మరో రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇలా ప్రతి ఏడాది ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. పసుపు పంట చేతికి రావాలంటే సుమారు తొమ్మిది నెలల కాలం పడుతుంది. అంత వరకు పంటకు ఖర్చు చేస్తూనే ఉండాలి.

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

ఉమ్మడి కడప జిల్లాలోని 21 మండలాల్లోనే పసుపును సాగు చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో పసుపు సాగు భారీగా తగ్గింది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతోంది. ఆయా మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఏ డాది మాత్రం కేవలం 5,600 ఎకరాలకే పరిమితమైంది. ఉదాహరణకు దువ్వూరు మండలంలో పసుపు సాగును గమనిస్తే 2018-2019లో 2500 ఎకరాల్లో సాగు చేశారు. 2019-2020లో 1800, 2020-2021లో 900, 2021-2022లో 550, 202223లో 533 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. పసుపు సాగు అత్యధికంగా ఖాజీపేట, దువ్వూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, కాశినాయన, సిద్దవటం, పుల్లంపేట, చాపాడు మండలాల్లోనే పసుపు సాగవుతుంది. ఈ ప్రాంతాల తర్వాత ఎక్కువగా చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట, రాజంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి మండలాల్లో సాగుచేస్తారు. బ్రహ్మంగారిమఠం, బి.కోడూరు, అట్లూరు, గోపవరం, నందలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో కొద్దిగా సాగు చేస్తారు. కాగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో పసుపు సాగుకు రైతులు అనాశక్తి చూపుతున్నారు.

అధికమవుతున్న సాగు ఖర్చులు



పసుపు పంట సాగుకు ఎకరాకు రూ.80 నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతున్నాయి. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నది. ప్రస్తుతం ఉన్న ధరలకు సాగు ఖర్చులు కూడా రావడం లేదు. రూ.10మ వేల వరకు పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది. ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం.

సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తున్నాం



స్థానికంగా వట్టి పసుపు సరైన ధరలు లేకపోవడంతో మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌కు పసుపు తరలించేందుకు సిద్ధపడుతున్నాం. సాంగ్లీ మార్కెట్లో ఎలాంటి షరతులు లేకుండా క్వింటా రూ.5500 ధర పలుకుతున్నది. గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో పసుపు పంటను సాగు చేసే వారం. ప్రతి ఏడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు మిగులుతున్నాయి. పసుపు పంట సాగు తగ్గించాం. పసుపు పంట ఏడాదిపాటు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉన్నది. గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగు తగ్గిస్తున్నాం.

- సురేష్, రైతు, చాపాడు.

మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలి

పసుపు పంటకు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలి. కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలి. జాతీయ స్థాయిలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి. పంట విస్తీర్ణంతో సంబంధంలేకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. పసుపు రైతులు ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టగా 25 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటాలు రూ.5 వేలకు మించి కొనుగోలుచేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. క్వింటాలు పసుపు రూ.10 వేలుకు కొనుగోలు చేయాలి.

- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం, కడప.

నాడు-నేడు పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

మనబడి నాడు-నేడు పనులకు నెలమాత్రమే గడువు ఉందని, వేగం పెంచాలని సంబంధితాధికారులను కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మనబడి - నాడు నేడు రెండో విడత పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన బడి -నాడు నేడు రెండవ విడత పనుల పురోగతి మీద శ్రద్ధ పెట్టి, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పూర్తి చేయాలన్నారు. సెలవులలో పాఠశాలల్లో అవసరమైన తరగతి గది, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. నిర్దేశిత పాఠశాలల్లో నూతన మరుగుదొడ్లు, వంటగదుల నిర్మాణం, విద్యుత్ సంబంధిత పనులు సెలవుల్లోనే పూర్తి చేసి సిద్ధంగా ఉంటే ప్రభుత్వం పాఠశాలల్లో అవసరమైన డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు, ఫ్యానులు, ఆర్వో ప్లాంట్, స్మార్ట్ టీవీలు, ఇతర సామగ్రి సరఫరా చేస్తుందన్నారు. పెయింటింగ్ పూర్తి బడులకు పిల్లలను ఆహ్వానించాలన్నారు. జిల్లాలో రూ.37 కోట్ల కేవలం నాడు - నేడు పనుల నిమిత్తమే అందుబాటులో ఉందని, రోజూ పనులు నిర్వర్తింపేసి నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలన్నారు. నాడు నేడు పనులు నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారి మీద ఎంతటి చర్యాలకైనా తాను వెనుకాడని తీవ్రంగా హెచ్చరించారు. మదనపల్లిలో వారం ఎన్ని ఉన్నాయో అదే ఉన్నాయని ఏం చేస్తున్నారని ఎంఇఒ కలెక్టర్ ప్రశ్నించారు. ఒక బిల్లు ఎందుకు పెట్టలేదన్నారు. మరుగుదొడ్లు 45 ప్రోగ్రెస్‌లో ఉన్నాయి, పది ఇంకా ప్రారంభం కాలేదు, ఎందుకు కాలేదని కలెక్టర్ ప్రశ్నించారు. వచ్చేవారం కల్లా ప్రారంభం కానివి ఏవి ఉండకూడదు అన్నారు. కిచెన్ షెడ్స్ సంబంధించి కోడూరులో ఎందుకు బిల్లు పెట్టలేదని ఎంఇఒను కలెక్టర్ ప్రశ్నించారు. కె.వి పల్లి నాలుగు, రామాపురం ఏడు, సంబేపల్లి ఏడు ప్రారంభంలో ఉన్నాయి అన్నారు. మదనపల్లి టాయిలెట్స్ మరమ్మతులు 17, తరగతి గదులు మరమ్మతులు 20 ఉన్నాయని, వచ్చే వారంలో వెనకబడితే మాత్రం సహించేది లేదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, సమగ్ర శిక్ష సిఎంఒ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు పెళ్లి కానుక : జెసి



లబ్ధిదారులకు చెక్‌ను అందజేస్తున్న ఇన్‌ఛార్జి జెసి సత్యనారాయణ

ప్రజాశక్తి- రాయచోటి

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కుటుంబాల్లో చెల్లెమ్మల వివాహాలకు అండగా నిలిచేందుకు వైఎస్‌ఆర్ కల్యాణమస్తు వైఎస్‌ఆర్ తోఫా పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తోందని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సత్య నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2023 జనవరి-మార్చి త్రైమాసికంలో వివాహం చేసుకున్న 12,132 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.87.32 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి 349 మంది జంటలకు రూ.2,.76 కోట్ల కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి జెసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడం, ప్రతి చెల్లెమ్మనూ, ప్రతి తమ్ముడినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడం, పేద కుటుంబాల్లోని వధువుల తల్లిదం డ్రులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ఒక సమున్నత లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని ఆడబిడ్డలకు వైఎస్‌ఆర్ కల్యాణమస్తును మైనార్టీ అమ్మాయిలకు షాదీతోఫా కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అంది స్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. జిల్లాలోని 349 మంది అర్హులకు సంబంధించి రూ.2.76 కోట్ల చెక్కును అందజేశారు.

చరిత్రను మలుపు తిప్పిన 'కార్ల్ మార్క్స్'



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మానవ జాతి చరిత్రను మలుపు తిప్పిన మహోన్నత వ్యక్తి కార్ల్‌మార్క్స్ అని సిపిఎం కమిటీ సభ్యులు ఎ. రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కార్ల్‌మార్క్స్ 205వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దుర్మార్గపు దోపిడీ వ్యవస్థ సమర్థకులు మార్క్సిజానికి కాలం చెల్లిందని కారుకూతలు కూస్తున్నా ఇప్పటికీ ప్రపంచంలోని కోట్లాది కార్మికులు పీడిత, బడుగు బలహీన వర్గాలు తమ విముక్తి కోసం మార్క్సిజం వెలుగులు పోరాడుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె. నాగబసిరెడ్డి, ఎస్. రామచంద్ర, ఎం.సురేంద్ర జె. వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం : ఎమ్మెల్యే



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్ సిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి మున్సి పాలిటీలోని 23, 24వ సచివాలయ పరిధిల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 33వ వార్డులో బ్రాహ్మణ వీధి, రవితేజ హాస్పిటల్ లైన్, రవీంద్రా భారతి స్కూల్ లైన్, గౌరమ్మ బుగ్గ వీధిలలోనూ, 32 వార్డులో తొగట వీధి, శివాలయం వీధి లలో ప్రతి గడప కూ ఆయన వెళ్లి ప్రజా సమస్యలు ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ మూడన్నరేళ్ళపాలనా కాలంలో 98 శాతానికి పైగా నెరవేర్చారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా కొనసాగిస్తున్నారని తెలిపారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాష, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కమిషనర్ గంగా ప్రసాద్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, స్థానిక కౌన్సిలర్లు జోష్న, గువ్వల లక్ష్మీదేవి, అన్నయ్య, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, మైనారిటీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేష్, వెంకటేష్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, గౌస్ ఖాన్, యుగంధర్, జగదీష్, జగన్ పాల్గొన్నారు.



ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మురళి

హార్సిలీహిల్స్‌లో ఆరోగ్య ఉప కేంద్రం : ఆర్‌డిఒ

బి.కొత్తకోట: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ప్రభుత్వం పర్యాటకుల సౌకర్యార్థం ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేసినట్లు మదనపల్లె ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మందులు ఎలా వస్తున్నాయి. అన్ని అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను స్టాఫ్ నర్స్ జి.స్వాతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఏ ఒక్కరూ అస్వస్థకు గురి కాకూడదన్నారు. పర్యాటకులు ఎవరైనా అనారోగ్యానికి బారినపడితే అటు మదనపల్లి, ఇటు బి.కొత్తకోటకు వెళ్లవలసిన పరిస్థితి ఉండేదని, అత్యవసరమైతే ఇబ్బంది పడేవారు. కాబట్టి పర్యాటకుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ పి.ఎస్.గిరిష ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ధనుంజయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఐసిడిఎస్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ నాగవేణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలంలో మూడు, పెద్దమండెం మండలంలో నాలుగు, ములకలచెరువులో ఒకటి, పిటిఎంలో ఐదు అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు పంపుకోవాలన్నారు. అభ్యర్థులు ఇతర వివరాలకు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ తంబళ్లపల్లె కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఇకెవైసి గడువు పెంచాలి

పీలేరు: ప్రభుత్వం ప్రకటించినట్లు ఇకెవైసి చివరి గడువు ఈ నెల 11వ తేదీన కాకుండా, నెలాఖరు వరకు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వగళ్ల చంద్రారెడ్డి, ఎర్రమరాజు కోరారు. పీలేరు పాత బస్టాండులోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో శుక్రవారం సంఘ సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పింఛనుదారుల్లో చాలా మంది అనారోగ్య రీత్యా, అవగాహన లేమి కారణాలవల్ల ఇకెవైసి పూర్తిస్థాయిలో చేయించుకోలేకపోయారని పేర్కొన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ అధికారులు ఇప్పటి వరకు ఈకెవైసి చేయించుకోని వారి వివరాల జాబితాను ప్రకటించాలని కోరారు. అలా చేయడం వల్ల తాము నిర్దిష్ట సమాచారం తెలుసుకుని, తద్వారా ఆ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సభ్యులు కూడా ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఈకెవైసిని పూర్తిచేసుకుని, ఆ సమస్యను అధిగమించి, పెన్షన్ తీసుకునే సమయంలో ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు, సభ్యులు సీతారామయ్య, ఆంజనేయులు, మునాఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి

'ఫ్యామిలీ డాక్టరు'తో మెరుగైన వైద్యం : డిఎంహెచ్‌ఒ



గర్భిణితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామీణ పేదల ఆరోగ్యానికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కాటిమాయకుంటలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడికీ హెల్త్ ఐడి నంబర్ ఇస్తున్నామని, దీన్ని ఆధార్‌తో లింక్ చేస్తామని చెప్పారు. ఐడిహెల్త్ కార్డులో డెటా చెక్ చేసుకోవచ్చన్నారు. ఫ్యామిలీ డాక్టర్ యాప్‌లో వివరాలు అన్నీ కుటుంబాల వారీగా అప్‌డేట్ చేస్తారని తెలిపారు. 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు, గుండెకు సంబంధించి ఇసిజి పరీక్షలు కూడా అందుబాటులో ఉంచామన్నారు. గ్రామ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురించి తెలిసేలా సచివాలయంలో వైద్యులు, సిహెచ్‌ఒ, ఆరోగ్య కార్యదర్శి, ఆశాకార్యకర్తల పేర్లు, వారి ఫోన్ నంబర్స్,పేర్లు అన్నీ కనిపించేలా చార్ట్ డిస్‌ప్లే చేస్తామన్నారు. మొత్తం 78 మందికి చికిత్సలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి వేణుగోపాల్, యాండపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ దివ్యవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌సిపి/సిహెచ్‌ఒ ఉషారాణి, ఎఎన్‌ఎం చంద్రకళ, ఆశాకార్యకర్త, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి వినోదం

ప్రజాశక్తి - రాయచోటి

జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి పట్టణంలోని కొత్తపేట విజ్ఞాన్ హైస్కూల్‌లో వేసవి వినోదం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెవివి మండల కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెవివి జ.ఇల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఏడాది పొడవున్నా పాఠ్యపుస్తకాలతోనూ, పరీక్షలతోనూ మానసిక ఒత్తిడికి గురై ఉంటారని, వారి కోసం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వినోదంతోపాటు విజ్ఞానం అందించడానికి జెవివి కృషి చేసోతం దన్నారు. పిల్లలకు మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, గణితంలో మెలకువలు, హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, ఓరిగామి, ఆటలు, పాటలు, కథలు నేర్పింస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 7లోగా పేర్లు 9490057161 9550605575లలో నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో జెవివి నాయకులు శివయ్య, రామయ్య శేషారెడ్డి, మధుసూదన్ రాజు, ప్రతాపరెడ్డి, ఓబుల్ రెడ్డి. రవీంద్రనాథ్‌రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, శివారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని తిప్పాయపల్లె రెవెన్యూ గ్రామ బావికాడపల్లి ఎస్టి కాలనీకి శనివారం ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ మెంబర్ శ్రీ వైదిత్య శంకర్ నాయక్ విచ్చేయునట్లు మండల తాసిల్దార్ నరసింహ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అధికారులందరూ ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు. ఎస్టి ప్రజల సమస్యలు పరిష్కార మార్గం దిశగా ఈ కార్యక్రమం సాగుతుందని తెలియజేశారు.

బదిలీలు అన్యాయం : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి

ఉపాధ్యాయుల బదిలీలను అక్రమ మార్గాలలో చేయడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రులు, శాసన సభ్యులు, రాజకీయ నాయకులు సిఫార్సు చేసిన బదిలీలను వెంటనే అమలు చేయాలని విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా, వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామని జీవోలు 187,190 విడుదల చేసి, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న తర్వాత నిర్వహించలేక ఇచ్చిన జీవోలను రద్దు చేసిన విద్యాశాఖ అక్రమ బదిలీలను చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బదిలీల మార్గదర్శకాలు వివాదాలకు తావు లేకుండా విడుదల చేసి ఈ వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని పేర్కొన్నారు.

సంక్షేమ కేలండర్ ఆవిష్కరణ

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం లబ్ధిదారులకు మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన 'జగనన్న ప్రభుత్వ సంక్షేమ కేలండర్ 2023-24'ను శుక్రవారం ఆవిష్కరించారు. సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణలో డిఆర్‌ఒ సత్యనారాయణ, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్‌ఒ సిహెచ్ పురుషోత్తం, గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య, పిఆర్‌ఒ ధర్మ నాయక్, ఎఐఇ నాగేశ్వరరావు హాజయ్యారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కేలం డర్‌లో పొందుపరచడం సంతోషంగా ఉందన్నారు. అధికా రులు వారి శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలను ఎప్పటి కప్పుడూ ఉన్నతాధికారుల సూచనల మేరకు పంపిణీ చేసేం దుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం రూపొందించిన 2023-24 ఆర్థిక సంవత్సర సంక్షేమ కేలెండర్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు పంపిణీ చేయాలని సూచించారు.



సంక్షేమ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష


ఆమోద పత్రాలు అందుకుంటున్న అసోసియేషన్ పెద్దలు

19న ఫొటోగ్రఫీ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఫొటోగ్రఫీ రంగానికి ఎన్నికల నగారా మోగింది. ఈ నెల 19వ తేదీన శ్రీఅన్నమయ్య ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్కు ఎన్నికలు జరగనున్నాయి. వీడియో కెమెరా గుర్తుతో తుమ్మలదుల పుల్లయ్య, ఫొటో కెమెరా గుర్తుతో తుమ్మలూరు సుబ్బరాయుడు బరిలో పోటీ పడుతున్నారు. రాజంపేట, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, చిట్వేలి మండలాలకు సంబంధించిన 198 మంది ఓటర్లు ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకుని అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నారు. శుక్రవారం అసోసియేషన్ పెద్దలు ఈనాడు స్టూడియో శీను, శ్రీకాంత్ స్టూడియో శ్రీధర్ ఫోటోగ్రఫీ కార్యాలయంలో సమావేశమై ఎన్నికలకు సంబంధించిన పత్రాలు, నియమాలు గురించి అభ్యర్థులకు వివరించారు. అనంతరం అభ్యర్థుల వద్ద ఆమోద పత్రాలు పై సంతకాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థులు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ స్టూడియో నిస్సార్, గణేష్ స్టూడియో నాగేంద్ర, రాయల్ స్టూడియో రమణ, దేవి స్టూడియో చంద్ర, కెవిఆర్ స్టూడియో రమణ, ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

రేపు గర్భిణులకు యోగా సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక జ్యోత్స్న మెటర్నిటీ, జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గర్భిణుల సమస్యల పరిష్కారాల కోసం వైష్ణవి యోగా టీచర్, బెంగుళూరు వారిచే అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జె.రెడ్డెప్ప తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక శ్రీకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధారణకాన్పు కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, గర్భధారణ సమయంలో ఎదురయ్యే సమస్యలు, కాన్పు నొప్పులను భరించగలిగే స్థాయి సముపార్జన, గర్భధారణ సమయంలో వచ్చే షుగర్, బిపి, కాళ్లవాపులు నియంత్రించుకోవడం, నిద్రలేమి సమస్యను అధిగమించడం, ప్రసవం తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాపాయి,బాబుతో కనెక్ట్ కావడంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

నాగిరెడ్డి హయాంలోనే అభివృద్ధి : 'మండిపల్లి'

ప్రజాశక్తి- రాయచోటి

తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి హయాంలోనే రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని ఆయన తనయుడు, తెలుగుదేశం పార్టీ రాయచోటి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణం ఎస్ఎన్ కాలనీలోని మండిపల్లి భవన్లో మండిపల్లి నాగిరెడ్డి 31వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి చిత్రపటానికి ఆయన అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన తనయుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గానికి తన తండ్రి నాగిరెడ్డి చేసిన సేవలు నేటికి మరవ లేనివన్నారు. 1985, 1989 లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి రాయచోటి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్, డిపో, నేతాజీ క్లబ్, చెక్ పోస్ట్ వద్ద వాటర్ ట్యాంక్ వంటివి నిర్మించడమే కాకుండా కొత్తగా అప్పుడే వచ్చిన ఆర్టీసీ బస్సులను సైతం మారుమూల గ్రామాలకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. ఆయన మన మధ్య లేకున్నా ఆయన చేసిన అభివృద్ధి ఎన్నటికీ మరవలేమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, హరి, విష్ణువర్ధన్ రెడ్డి. బిందు రెడ్డి, కొండారెడ్డి మదన అభినయ్, నాగార్జున రెడ్డి మధు. శివారెడ్డి ఆనంద్ మీసాల వెంకటరమణ, కేతరి వెంకటరమణ, నంద, భూపేష్, జయరాము, వెంకట్ రెడ్డి, రెడ్డి శేఖర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రజల నడ్డివిరుస్తున్న ప్రభుత్వం : 'కస్తూరి'


ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చిట్వేలి

వైసిపి ప్రభుతం ప్రజల నడ్డి విరుస్తోందని టిడిపి రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్ఛార్జి కస్తూరి విశ్వనాధనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని నక్కలపల్లి, మాలేమార్పురం పంచాయతీ గరుగుపల్లిలో, ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి ప్రభుత్వాన్ని చేపట్టిన అనతి కాలంలోనే ప్రజలపై అనేక రకాల పన్నుల రూపంలో భారాలు మోపారన్నారు. నిత్యావసర సరుకులు ధరలు అధికంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తూ నరకం చూపిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రాష్ట్రానికి పట్టిన ఇదేమి కర్మ అంటూ వెళ్లిన తెలుగుదేశం నాయకులకు ప్రజలు పెద్ద ఎత్తున బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. పూర్వం రాజుల కాలంలో తప్పు చేసిన వారిపై సామవేద దండోపాయాలు ఉపయోగించే వారైతే ప్రస్తుత ప్రభుత్వం వారి పార్టీలో చేరకపోయినా, పార్టీని విమర్శించిన, పార్టీపై దుష్ప్రచారం చేసిన ఈ సామవేద దండోపాయాలు ఉపయోగిస్తున్నారన్నారు. త్వరలోనే ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజు దగ్గర్లో ఉందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వర నాయుడు, రామాం జనేయులు నాయుడు, చంద్రమోహన్ నాయుడు, లోకేష్, పెద్దూర్ రాజా, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు రాజా, వెంకటేష్రాజు, శివప్రసాద్రాజు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి


బుద్ధుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

నందలూరు: మండలంలోని ఆడపూరు గ్రామం వద్ద వెలసిన బౌద్ధారామాల వద్ద బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ ఇంటాక్ చాప్టర్, లయన్స్ క్లబ్, రాయలసీమ టూరిజం, యోగివేమన యూనివర్సిటీ, ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బుద్ధుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని జయంతి వేడుకలకు బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ ప్రెసి డెంట్ పిల్ల కుమారస్వామి, ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2500 సంవత్సరాల క్రితం బుద్ధుడు సమస్త మానవాళికి ఆచరణాత్మకంగా ఉండేందుకు చాలా బోధనలు చేశాడని ఆ బోధనలు సమాజ వికాసానికి వ్యక్తిగత వికాసానికి ఒక ఉపయో గపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు జ్యోజిరెడ్డి, బుద్ధిష్ట్ కల్చర్ సొసైటీ సెక్రటరీ ప్రసాద్, బుద్ధిస్ట్ కల్చర్ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ అశోక్కుమార్, డాక్టర్ రాజేశ్వరమ్మ, జాయింట్ సెక్రెటరీ శివారెడ్డి. విద్యార్థులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న చేతి వృత్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవవనరులు పుష్కలంగా వుంటున్న సమయంలో శరవేగంగా ప్రయాణిస్తున్న సాంకేతిక వ్యవస్థ కారణంగా చేతి వృత్తులు కనుమరుగవుతున్నాయి. సాంకేతింగా ఇతర దేశాలతో పోటీపడి అభివృద్ధి సాదించాలనే ఆశయం గొప్పదే అయినప్పటికి అది సామాన్య మానవులపై ప్రధానంగా చేతివృత్తులపై ప్రభావం చూపుతుంది. మానవ వనరులు కావాల్సిన మేరకు అందుబాటులో లేని దేశాలు ప్రత్యామ్నాయంగా నూతన యుగానికి సరిపడేలా సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసి అమలు పరుస్తున్నాయి. పల్లె సీమలు కళకళలాడినప్పుడే దేశం సౌభాగ్యవంతంగా ఉండగలుగుతుంది. పల్లెలలో ఉపాధి లభించక యువత పట్టణాలకు పరుగెత్తాల్సి వస్తోంది. కులవృత్తుల పైనే ఆధారపడి, అలవాటు పడిన అనేక కుటుంబాలు మరొక వృత్తి మొగ్గుచూపక తమ వృత్తిపరంగా ఉపాధిలేక అలమటిస్తున్నారు. చేతివృత్తినే నమ్ముకుని వారు రేయింబవళ్ళు కష్టించి పనిచేసినా వారి పనికి తగిన ప్రతిఫలం అందడం లేదు. అలాంటి కార్మికులు చేసే పనిని వదులుకోలేక, పనులు దొరక్క పోయిన పని కోసం ఎదురు చూసి అదే పనితో కాలం వెళ్ళదీస్తున్నారు. కొలిమి, కుమ్మరి, వడ్రంగి, సాకలి, క్షురకులు, మేదర, వడ్డెర, చేనేత, వ్యవసాయ, కూలీలు అప్పట్లో రైతులపై ఆధారపడి గౌరవంగా బతికేవారు. ప్రస్తుతం ఈ చేతివృత్త కార్మికుల చేతిలో ఉపాధిలేక మరొక పనులకు అలవాటు చేసుకోలేక అలమటిస్తున్నారు. పంట పొలాల్లో పండిన ధాన్యాన్ని ఇంటికి చేర్చాలంటే ఎద్దులబండిని ఉపయోగించేవారు. ప్రతి పనులకు నేడు యంత్రాలు వాడుకలోకి రావడంతో కార్మికులకు పని దొరకడమే కరువైంది. ప్రస్తుతం వరి విత్తనాలు నాటడం మొదలు పంటను సూర్పిడీ చేసే వరకూ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ కార్మకులు, వడ్రంగికి ఉపాధి లేకుండా పోతోంది. చిన్న వంట పాత్రలు మొదలు పెద్ద పరికరాలు వంటి కుక్కర్లు రావడం, లోహాల పాత్రలు వాడుకలోకి రావడంతో కుమ్మరులకు పని లభించటం లేదు. వర్షాలు సరిగా పడకపోవడంతో పంటలు పండక మేరను సరిగా ఇవ్వకపోవడంతో చాకలి, క్షురకులు ఉపాధి కోల్పోతున్నారు. చేనేతే వస్త్రాల స్థానే పెద్దపెద్ద యంత్రాలతో వస్త్రాలు తయారి కారణంగా చేనేత కార్మికులు ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారు. విధిలేని పరిస్థితిలో అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. కొందరు కులవృత్తి కార్మికులు కుటుంబమంతా పని చేసిన పూటగడవని పరిస్థితి ఏర్పడింది. సరళీకృత ఆర్థికవిధానాల కారణంగా చిన్నాచితక వ్యాపారులు అప్పులపాలై వీధిన పడుతున్నారు. మన దేశంలో కావాల్సిన వస్తువులు పుష్కలంగా లభిస్తున్నప్పటికి ధనిక దేశాల ఆదేశం మేరకు తప్పని సరిగా ఇతర దేశాల సరుకులను దిగుమతి చేసుకోవడంతో చిన్నపారిశ్రామికవేత్తలు కోలుకోలేని రీతిలో చతికిలపడుతున్నారు. ఈ ఆర్థిక విధానాల కారణంగా వీధుల్లో తిరిగి కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించేవారిని సైతం ప్రభుత్వం పొట్టగొడుతోంది. పెద్దపెద్ద సూపర్ మార్కెట్లలో ఎయిర్ కండిషన్ గదుల్లో కూరగాయలను విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నారు. పేదలకు ఉపాధి చూపించాల్సిన ప్రభుత్వం అనేక రకాలుగా ఉపాధికి గండికొడుతుండడంతో సామాన్యులు అయోమయంలో పడుతున్నారు. పోటీ ప్రపంచంలో సాంకేతిక మర్పులు మంచిదే అయినప్పటికీ ఈ విధానలు అమలు పరిచే ముందు ఆయా రంగాల కార్మికుల స్థితిగతులపై కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యామ్నాయంగా వారిని అన్ని విధాలుగా ఆదుకుంటే శ్రేయస్కరంగా ఉంటుందని పలువురు సామాజిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు 50 శాతం మంది చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి జీవనోపాధి కల్పించాల్సిన అవసరం ఉంది.


చేతి వృత్తి కార్మికులు తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు

ఏకగ్రీవంగా మదనపల్లె ఎపివిబిఎస్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఎపివిబిఎస్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆంధ్రప్రదేశ్ వాల్మీకి, బోయ సంఘం మదనపల్లి నియోజకవర్గ కమిటీ శుక్రవారం నిమ్మనపల్లి అభయాంజనేయ స్వామి ఆవరణంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు మదనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు పారేసి రెడ్డిభాస్కర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపివిబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు విక్రం నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర కోర్ కమిటీ నాగినేని గోవిందు అధ్యక్షతన అన్నమయ్య జిల్లా ప్రధానకార్యదర్శి బొమ్మనపల్లి లక్ష్మన్న ఆధ్వర్యంలో నిమ్మనపల్లి అభయాంజనేయ స్వామి ఆవరణంలో ఎపివిబిఎస్ మదనపల్లి నియోజకవర్గ కమిటీ, నిమనపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఎపివిబిఎస్ మదనపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా పారేసిరెడ్డి భాస్కర, ప్రధాన కార్యదర్శిగా పారేసి రాజగోపాల్, నిమ్మనపల్లి మండల అధ్యక్షులుగా పుర్రా వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా కె.సుధాకర, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రకాష్, కోశాధికారిగా వి.రెడ్డి ప్రసాద్, యువత అధ్యక్షులుగా గురికాని మునిరాజా, కార్యదర్శులుగా పి.సుధాకర్, పి.నరసింహులు, పి.మనోహర ఆర్.నవీన్, ఎం.మల్లప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు వాల్మీకుల సమస్యలను పరిష్కరించడానికి నిత్యం కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి చెన్నం వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటింటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్కుమార్రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ఇంటింటికీ నల్లారి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగిరిపల్లిలోని స్వగృహంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి కలికిరిలో నిర్వహించే ఇంటింటికీ నల్లారి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమంలో వైసిపి చేసిన ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని పేర్కొన్నారు. గతంలో పీలేరు నియోజకవర్గంలో నల్లారి కుటుంబం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్రెడ్డి, రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మరికుంటపల్లి, సర్పంచ్రెడ్డి రామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్కుమార్రెడ్డి

కల్యాణ మండపాన్ని ప్రారంభించిన మంత్రి


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలో నూతనంగా నిర్మించిన పిఎన్ఆర్ కల్యాణ మండ పాన్ని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎన్ఆర్ కల్యాణ మండపం ఎంతో అద్భుతంగా ఉందని, వివాహాలు జరుపుకోవడానికి చక్కని వేదికని కితాబునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందరికీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఆర్డిఒ మురళి, కమిషనర్ నరసింహ ప్రసాద్, తహశీల్దారు ధనుంజయులు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, కొండసిద్ధార్థ, ప్రభాకర్రెడ్డి, సలీం, బసిరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, మదుమూరు సర్పంచ్ నాగరత్న, పిటిఎం ఎంపిపి మహమ్మద్, ప్రభుత్వాస్పత్రి కమిటీ సభ్యులు మహేష్ పాల్గొన్నారు.

నేలమల్లేశ్వర ఆలయానికి రూ.50 వేల విరాళం

నిమ్మనపల్లి : మండలంలోని తవలం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి చౌకెళ్ళవారిపల్లెకు చెందిన మాజీ సైనిక ఉద్యోగి పెద్దిరెడ్డి సురేంద్రరెడ్డి రూ.50 వేలు విరాళంగా అందించారు. శుక్రవారం వైసిపి మండల ఇన్ఛార్జి రమణారెడ్డిని కలిసి చెక్ను అందజేశారు. నేలమల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రభుత్వం రూ.3 కోట్లతో చేపట్టడానికి సిద్ధమైందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్గా రూ.60 లక్షలు డిపాజిట్ చేయవలసి ఉందన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ తన వంతు సాయంగా రూ.50 వేలును అందించడం ఆనందంగా ఉందన్నారు. మరిన్ని విరాళాలు సేకరణపై తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధిని ఆకాంక్షించి విరాళాలు అందించే దాతలు ఆలయ కమిటీ సభ్యులు గోపాలకృష్ణను సంప్రదించాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బి.కొత్తకోట: లయన్స్ క్లబ్ మదనపల్లి, హార్సిలీహిల్స్, లయన్ కొండ నరేంద్ర, లయన్ డాక్టర్ విష్ణుప్రియల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కొండా నరేంద్ర రెసిడెన్సీ, కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో భారీగా తరలివచ్చారు. 334 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించ 101 మందికి ఉచిత కంటి అద్దాలను అందించారు. 175 మందికి కంటి ఆపరేషన్లు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. 58 మందికి మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మన్, డైరెక్టర్ లయన్ డాక్టర్ బోడిపాటి భాస్కర్ నాయుడు, మదనపల్లె లయన్స్ క్లబ్ అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి, హార్సిలీహిల్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ వాకా హరినాథ్రెడ్డి, ఏడీసీఎస్ లయన్ గౌతమ్ రెడ్డిలు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ నివేదిత పాల్గొన్నారు. కంటి అద్దాలు అవసరమైనవారికి లయన్ కొండా నరేంద్ర, డాక్టర్ విష్ణుప్రియల సౌజన్యంతో ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సతీష్కుమార్రెడ్డి

గిడ్డంగుల స్థల కేటాయింపులో జాప్యం

- సహకార సంఘం అధ్యక్షులు నారాయణరెడ్డి

ప్రజాశక్తి-వీలేరు

క్షేత్రస్థాయిలో వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపుల్లో రెవెన్యూ అధికారులు చూపుతున్న అలసత్వం ఫలితంగా వాటి నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతోందని పీలేరు సహకార సంఘం అధ్యక్షులు బిడి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కంభం నతీష్ కుమార్రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు వినియోగించుకోని పంచాయతీలు ఆ నిధులను తిరిగిస్తే వాటిని అత్యంవనర పనుల కోసం ఇతర పంచాయితీల్లో వినియోగించుకోడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యాన్ని విక్రయిస్తూ, ఎక్కువ ధరున్న బ్రాండ్లను అక్కడి సిబ్బంది నల్ల బజారుకు తరలించి, ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అంతే కాకుండా మద్యం దుకాణాలు పట్టణానికి దూరంగా ఉండడంతో మద్యం ప్రియులు దుకా ణాలకు వెళ్ళి రావడానికి అదనపు ఖర్చు అవుతోందని వారు వాపోతున్నట్లు చెప్పారు. దానికి తోడు ఉన్న రెండు మద్యం దుకాణాలు కూడా పట్టణానికి ఒకే వైపు ఉండడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ పి.లక్ష్మీ సరసయ్యకు తెలిపారు. నేవులబైలు ఎంపిటిసి సభ్యులు గాయం మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాలు మంజూరు చేయడంలో ఉద్యోగులు వివక్ష చూపుతున్నారని, నచివాలయంలో సిబ్బంది పనులు కొందరికే చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వేరుశెనగ విత్తనాలను సత్వరం పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. సభ్యుడు అమర్నాథరెడ్డి మాట్లాడుతూ కోటపల్లి మార్గంలో ఎక్కువ ఇండ్లు ఉన్నా, తక్కువ కెపాసిటీ విద్యుత్ నియంత్రికను ఏర్పాటు చేశారని, ఇండ్లలో ఫ్యాన్లు కూడా తిరగడంలేదని, అదనంగా ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసి సహకరించాలని విద్యుత్ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మురళీమోహన్ రెడ్డి. వైస్ ఎంపిపిలు హరిత, చలపతి, మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డి బాష, డిటి కిరణ్ కుమార్, ఎఇలు పురుషోత్తం, బాలాజీ నాయక్, పి.హెచ్.సి వైద్యులు కార్తీక్ కుమార్, రమేష్ కుమార్, చంద్రశేఖర్ నాయక్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వరూప, వలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.


అరవపల్లె జడ్పీ క్రీడా మైదానంలో మొక్కలు తొలగింపు

ఉపయోగంలోకి క్రీడా మైదానం

ప్రజాశక్తి-నందులూరు

మండలంలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానం కొన్ని సంవత్సరాల తరువాత క్రీడాకారులకు, వాకర్స్కు ఉపయోగపడేలా సుందరంగా రూపుదిద్దుకుంటుంది. మరో వారం రోజుల్లో నందలూరు ప్రీమియర్ లీగ్ 7వ సీజన్ ఉన్నందువలన పల్లె గ్రీష్మంత్రెడ్డి ఆధ్వర్యంలో అరవపల్లె ప్లే గ్రౌండ్ యూత్ సభ్యుల సహాయ సహకారాలతో మండలంలోని అతిపెద్ద క్రీడామైదానం అదుతేమైన స్థితికి చేరుకుంది. ఒకప్పుడు అడవిని తలపించేలా ఉన్నా ఈ క్రీడా మైదానం ఈరోజు ఇలాంటి అదుతేమైన స్థితికి రావడానికి సహకరించిన వారందరికీ క్రీడాకారులు, క్రీడాభిమానులు, అభినందనలు వ్యక్త పరుస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రౌండ్ యొక్క రాత మారకపోయినా, అరవపల్లె ప్లే గ్రౌండ్ యూత్ సభ్యులందరూ దగ్గరుండి 10 రోజులపాటు శ్రమించడంతో ఈరోజు కళ సాకారమైంది. ఈ నెల 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే నందలూరు ప్రీమియర్ లీగ్ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్కు జిల్లాల నలుమూలల నుండి ప్రతి ఒక్కరు తరలిరావాలని ఆర్గనైజర్ ముమ్మడిశెట్టి సుధాకర్ కోరారు.

8 నుంచి విద్యార్థులకు సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-కలికిరి

సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ నాయనారు మధుబాల ఆదేశాల మేరకు స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకు నిర్వహించబోవు సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, డ్రామ, చెస్, సంగీతం డాన్స్, యోగా, స్టోరీ రీడింగ్, విలువలు-విద్య నేర్పించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఈ సమ్మర్ క్యాంపు ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ముందుగా ఈ క్యాంపులో విద్యార్థులు తమ పేరును నమోదు చేసుకోవడానికి 7780169780 సంప్రదించాలని తెలిపారు. పలువురు వక్తలు, విశ్రాంత ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు అందజేసి విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానం గొప్పది

రామాపురం: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో పది రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జనార్ధన్రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్రెడ్డి, సర్పంచ్ నాగభూషణ్రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, మండల రైతు సలహా మండలి చైర్మన్ పెద్దిరెడ్డి, రాచపల్లి సర్పంచ్ వెంకటరెడ్డి, కొమ్మురోలపల్లి సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కిషోర్

ప్రజాశక్తి- కలకడ

ప్రభుత్వ వైద్య శాలల్లో కాన్పుల వల్ల తల్లి బిడ్డ సురక్షితంగా ఉంటారని ఎర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి కొనియాడారు శుక్రవారం మండలంలోని కదిరియాచెరువు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషి యన్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను త్వరితగతిలో నమోదు చేయాలని వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. 10 గ్రాములు రక్తం తక్కువ ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్ సుక్రోజ్లు. ఐరన్ టాబ్లెట్స్ డబల్ డోసు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ జి.జయరామయ్య ఎంపిహెచ్ఎస్. షేక్ముజీబ్బాష, రెడ్డమ్మ. ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాద్ బాబు, పి.శ్రీలక్ష్మి, ఎంఎల్హెచ్పి ఎస్.లావణ్య. డేటా ఎంట్రీ రోజా, పైలట్ రమేష్ బాబు, ఆశకార్యకర్తలు సుజాత, కుమారి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోండి

నందలూరు: కక్షిదారులు ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కె.లత తెలిపారు. నందలూరు, రాజంపేట కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులతో శుక్రవారం స్థానిక కోర్టులో ఆమె క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13న జాతీయ లోక్అదాలత్ నిర్వహించబడునని, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో కోడూరు సిఐ విశ్వనాథరెడ్డి, పుల్లంపేట, పెనగలూరు, రాజంపేట అర్బన్, రూరల్, చిట్వేల్ ఎస్ఐలు సుబ్బారెడ్డి, హేమాద్రి, ప్రసాద్రెడ్డి, భక్తవత్సలం, సుభాష్ చంద్ర బోస్, ఎఎస్ఐ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి


మాట్లాడుతున్న ఎంపిపి బాబుల్రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి ముద్దా బాబుల్రెడ్డి అన్నారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాలన్నారు. జగనన్న కాలనీలో నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులకు తెలియజేశారు. మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అన్ని పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారమే రుచికరంగా భోజనం వడ్డించాలని మండల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండలంలో రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తహశీల్దార్కు సూచించారు. సమావేశంలో మండల వైస్ ఎంపిపి జయశంకర్ నాయుడు, ఎంపిడిఒ ప్రకాశం, తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంఇఒ రంగనాథయ్య, ఎఒ కృష్ణచైతన్య, పశుసంవర్ధక శాఖ అధికారి సుధీష్, డాక్టర్ మనోజ్ డాక్టర్ సానే శేఖర్, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

సాధారణ బదిలీలు నిర్వహించాలని మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కలకడ: మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు సాధారణ బదిలీ నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఎపి మోడల్ స్కూల్ ఉపా ధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ బాలాజీ తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖలో ఉన్న ఉపాధ్యాయులకు వలే సాధారణ బదిలీలు నిర్వహించాలని, జీతాలను 010 పద్దు ద్వారా చెల్లించాలని, సర్వీస్ రూల్స్ రూపొందించి ప్రమోషన్లు ఇవ్వాలని, హెల్త్ కార్డులు విడుదల చేయాలని, కారుణ్య నియమకాలు చేపట్టాలని కోరామని పేర్కొన్నారు. ఆరవ తరగతి, ఇంటర్ అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టాలని కోరామన్నారు. మోడల్ స్కూల్స్ జెడి కృష్ణారెడ్డి కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.